క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సి.బెళగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి వాహనదారులను హెచ్చరించారు. ఆయన శుక్రవారం పోలీసు సిబ్బందితో కలిసి సి.బెళగల్ మండల కాంప్లెక్స్ వద్ద గూడూరు – ఎమ్మిగనూరు ప్రధాన రోడ్డుపై వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని 16 మంది వాహనదారులపై కేసు నమోదు చేసి, రూ.6,800 జరిమానా విధించారు. అలాగే ట్రాఫిక్ నియమ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రేషన్ డీలర్ అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ



సి.బెళగల్లో వీఆర్వోకు హాల్‌టికెట్లు అందజేస్తున్న డీటీ పురుషోత్తం

సి.బెళగల్: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ అయినట్లు డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆర్డీఓ కార్యాలయం నుంచి అందిన గుండ్రేవుల గ్రామ డీలర్ పోస్టుకు ఏడుగురు అభ్యర్థుల హాల్ టికెట్లను ఆ గ్రామ వీఆర్వో రామోహ్మన్‌రెడ్డికి అందజేశారు. కృష్ణదొడ్డి గ్రామానికి రెండు దరఖాస్తులు, పోలకల్ గ్రామంలోని రెండు రేషన్ షాప్‌లకు నమోదైన రెండు దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురైనట్లు డీటీ తెలిపారు. హాల్ టికెట్లు అందుకున్న అభ్యర్థులు ఈనెల 5వ తేదీ కర్నూలులో జరిగే రాత పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుందని, అదే రోజు రాత పరీక్షల ఫలితాలు వెల్లడించనున్నట్లు చెప్పారు.

ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



ఇనగండ్లలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ)వినియోగంలోకి తేవాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల తయారీలో భాగంగా గ్రామ సర్పంచ్ ఇమ్మానుయేల్ చేపట్టిన ఎరువులో వానపాముల విడుదలను ఆయన పరిశీలించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ, మండలంలోని 18 గ్రామ పంచాయతీలకుగాను 12 గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఈ కేంద్రాలకు గ్రామాలలోని చెత్తను తరలించి సేంద్రియ ఎరువలను తయారు చేసి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు వెంట ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



కొండాపురంలో డీఎల్‌పీఓ లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ రత్నమ్మ

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారిణి (డీఎల్‌పీఓ) లక్ష్మి సూచించారు. ఆమె శుక్రవారం మండలంలోని కొండాపురం గ్రామంలో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. డీఎల్‌పీఓ గ్రామానికి వచ్చిన సందర్భంగా సర్పంచ్ రత్నమ్మ నూతన సంవత్సర శుభాకాంక్షలతో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో పరిశీలించి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి అంశాలు, నిధుల వినియోగం వివరాలను పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలకు విడుదలయ్యే నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని, దుర్వినియోగం అయితే చర్యలు తప్పవని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోడుమూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో దంపతులు రామగోవిందు (56), వరలక్ష్మి (50) మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను శుక్రవారం కోడుమూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ.శ్యాంబాబు పరామర్శించారు. దంపతుల కుమారుడు తేజ, కుమార్తె రేణుకను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బాబోయ్ చలి!

- చల్లటి గాలిలో బయట తిరగొద్దంటున్న వైద్యులు
- అధికంగా సీజనల్ వ్యాధులు
- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గడివేముల: చలి పులి ప్రజలను వణికిస్తోంది. గత పది రోజులుగా క్రమేపీ రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి వాతావరణం పూర్తిగా చల్లబడిపోతుంది. దీంతో ప్రజలు సాయంత్రం నుంచి బయట తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో చలి వల్ల జలుబు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, జ్వరాల బారిన పడే అవకాశం ఉందని, చిన్నారులు, వృద్ధులు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారు చలి నుంచి రక్షించుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. కోవిడ్ సోకి బయటపడిన వారు చలికాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. ముఖ్యంగా చలికాలంలో శ్వాస నాళాలు ముడుచుకుపోయే అవకాశం ఉంటుందని, గాలిలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉంటుందని తగిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు తీసుకుంటే చలి నుంచి రక్షించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా

- శీతాకాలంలో చర్మం పొడి బారిపోతుంటుంది. మాయిశ్చరైజర్లు తప్పనిసరిగా వినియోగించాలి.
- చలికాలంలో చాలామంది నీరు తాగడం తగ్గిస్తారు. తగిన మోతాదులో మంచినీళ్లు తీసుకోవాలి.
- ఐస్‌క్రీములు, చల్లని నీరు, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి.
- వేడి ఆహారం తీసుకోవాలి. నిల్వ ఉన్న ఆహారం, మాంసాహారం బాగా తగ్గించాలి.
- గోంగూర, వంకాయ, కొబ్బరికాయ పడనివారు ఈ కాలంలో తినడం తగ్గించాలి.
- ఎండు చేపలు తినడం మానేయాలి. దీనిలో అధికంగా ఉండే ఉప్పు ఇబ్బందికరంగా మారుతుంది.
- దుమ్ము, ధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. చలిగాలులకు బయట తిరగకుండా ఉండడం మంచిది.
- ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్ ఏడాదికి ఒకసారి, న్యూమోనియా వ్యాక్సిన్ ఐదేళ్లకు ఒకసారి వైద్యుల సూచనలతో వేసుకుంటే మంచిది.
- ఇండోర్ వ్యాయామం, జిమ్ చేసే విధంగా ప్లాన్ చేసుకోవాలి.
- వృద్ధులు, పిల్లలు చలిలో తిరగకుండా చూడాలి.
- రాత్రిళ్లు చలిలో ప్రయాణాలు చేయరాదు. అత్యవసరం అయితే శరీరానికి వెచ్చదనం అందించే ఉన్ని దుస్తులు ధరించాలి.
- ఇంట్లో ఎవరికైనా జలుబు, దగ్గు వస్తే వైద్యుల సూచనలతో మందులు వాడాలి. సొంత వైద్యం సరి కాదు. కుటుంబంలో ఒకరికి వాడే ఔషధాలు వేరొకరికి వినియోగించడం సరికాదు.
- శీతాకాలంలో శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి



మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన ఉన్ని దుస్తులు

జాగ్రత్తగా ఉండాలి



శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలి. చలి నుంచి శరీరాన్ని రక్షించుకోవాలి. ఈ కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే సి విటమిన్ కలిగిన పదార్థాలు, సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తీసుకుంటే మంచిది. ముఖ్యంగా గతంలో కోవిడ్ బారినపడిన వారు, శ్వాసకోశ వ్యాధులు, గుండె సమస్యలు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. అనారోగ్య సమస్య వస్తే వెంటనే స్థానిక పీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందాలి.

– డాక్టర్ కిరణ్‌కుమార్, గడివేముల పీహెచ్‌సీ వైద్యుడు

ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి



దిగువపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు

గడివేముల: రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 12 అర్జీలు వివిధ రకాల సమస్యలతో కూడిన వినతి పత్రాలు రైతులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ రీసర్వేలో జరిగిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సర్పంచ్ సుంకన్న, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఈఓ నాగప్రసాద్, ఆర్ఐ ఎల్ల సుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో శుక్రవారం కర్నూలు మండల డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 10 అర్జీలు అందాయని డీటీ తెలిపారు. ఆయా వినతులను త్వరలో పరిష్కరిస్తామన్నారు. వీఆర్ఓలు, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీత

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం
- కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి
- అంగన్‌వాడీల్లో చిన్నారుల పోషణ అంతంతే
- టీడీపీ నేతల ఇళ్ల వద్ద రేషన్ పంపిణీపై ధ్వజం
- ప్రొటోకాల్ మరచిన అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, ఇళ్లు లేని వారికి ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు కావాలంటే కూటమి నేతలకు మామూళ్లు ఇవ్వాల్సిందేనని, అలాగే మండలస్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పోషణ కిట్లపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన, ఎంపీడీఓ నాగేశ్వరాచలరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి, ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మండల స్థాయి అధికారులు శాఖల వారిగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

- ఇంటి స్థలం, ఇల్లు మంజూరు కావాలంటే కూటమి నాయకులు డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారని సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లోని పేద వర్గాలు, ముఖ్యంగా గృహ వసతి లేని వారికి ప్రభుత్వం ఉచితంగా స్థలం, ఇళ్లు మంజూరు చేస్తుంటే, పల్లెల్లో కూటమి నేతల చేతులు తడపందే పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ శారద వాపోయారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నా ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న గుడ్లు, పోషణ కిట్లలో నాణ్యత ప్రమాణాలు ఉండడం లేదని, గుడ్లు కుళ్లిపోయినవి ఇస్తున్నారని, అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పొలాల రస్తాలు బాగు చేయాలని పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి సభ దృష్టికి తెచ్చారు.
- కె.మార్కాపురంలో టీడీపీ నాయకుల ఇంటి వద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ గణ మద్దిలేటి సభ దృష్టికి తెచ్చారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి కోరారు. గతంలో ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారులకు బిల్లుల మంజూరు ప్రక్రియ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు బిల్లులు మంజూరు చేయాలని కోరారు.
- కె.మార్కాపురం గ్రామీణ పశు వైద్యశాలకు వైద్యులు హాజరుకావడం లేదని సర్పంచ్ గణ మద్దిలేటి సభ దృష్టికి తెచ్చారు. గత సమావేశంలో కూడా సమస్యను ప్రస్తావించారనని, ఇంతవరకు పరిష్కరించకపోవడంతో చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, కె.మార్కాపురం గ్రామాలకు చెందిన పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

సమావేశానికి ఆర్అండ్‌బీ, సాంఘిక సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడంతో అందుకు సంబంధించిన సమస్యలను ఎవరిని అడగాలని సభలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గుంతల రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని, గ్రామాల్లో ప్రాధాన్యతలను అనుసరించి రోడ్లు వేస్తున్నామన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా



వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్లహర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లతో ప్రభాకర్‌రెడ్డి

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ప్రకటన వెలువడగా, శుక్రవారం ప్రభాకర్ రెడ్డి కోడుమూరు నియోజకవర్గ నాయకులు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లను కలిసి ధన్యావాదాలు తెలిపారు. అదేవిధంగా తనను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, తనకు పార్టీ జిల్లా పదవిని కల్పించడం ఆనందంగా ఉందని, పార్టీలో ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాన్నారు.

పిచ్చి మొక్కలతో నిండిన గడిగరేవుల జెడ్పీ పాఠశాల మైదానం



గ్రౌండ్ ఇలా.. ఆడుకునేది ఎలా?

మండల పరిధిలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరినా పాఠశాల హెచ్‌ఎం గానీ, సంబంధిత విద్యాశాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడం బాధాకరమని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల గ్రౌండ్ మొత్తం గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉంటే ఆటలు ఎలా ఆడుకోవాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఆ స్కూలు విద్యార్థులందరూ క్రీడలకు దూరమవుతున్నారు. గ్రౌండ్ అభివద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి విద్యార్థులకు ఆడుకునే విధంగా ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

– గడివేముల



సి.బెళగల్: పూలే దంపతుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం ఈడీ సరోజ, చిన్నారులు



కర్నూలు(రూరల్): నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు



ఓర్వకల్లు: పూలే దంపతుల విగ్రహాల వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

సావిత్రీబాయి పూలేకు ఘననివాళి



కోడుమూరు రూరల్: సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్: భారతదేశంలో స్త్రీ విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పిన వనిత సావిత్రిబాయి పూలే అని కోడుమూరు గ్రామ సర్పంచు భాగ్యరత్న అన్నారు. శుక్రవారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంఘ సంస్కర్త, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. సర్పంచు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే మహాత్మ జ్యోతిరావు పూలే శ్రీమతి అయిన సావిత్రీబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా మహిళా విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ పాఠశాలలను స్థాపించి మహిళలకు విద్యను అందించారన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ సమాజంలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. అలాగే వాడవాడలా, వివిధ సంఘాల ఆధ్వర్యంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



ఓర్వకల్లు: మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ తదితరులు



పాణ్యం: మోడల్ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



గడివేముల: ఎంఈఓ మేరీ సునీతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డుపై నూర్పిళ్లు.. ప్రమాదానికి హేతువులు



అమడగుంట్ల-కె.నాగలాపురం రోడ్డుపై కంది దిగుబడులను నూర్పిడి చేస్తున్న రైతులు

రోడ్లపై రైతులు చేపడుతున్న పంట నూర్పిళ్లు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. మండలంలోని అమడగుంట్ల గ్రామం నుంచి కె.నాగలాపురం వెళ్లే రోడ్డుపై కొందరు రైతులు కంది నూరిఎళ్లు చేస్తున్నారు. యంత్రాల ద్వారా నూర్పిళ్లు చేస్తే ఖర్చవుతుందన్న కారణంతో రోడ్లపై కంది కట్టి వేసి వాటిపై వాహనాలు వెళ్లడంతో రాలిన గింజలను పోగు చేసుకుని వెళుతున్నారు. అయితే రోడ్లపై కంది కట్టి వేయడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పంట నూర్పిళ్లపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే జారి కింద పడే ప్రమాదం నెలకొంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– కోడుమూరు రూరల్

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక అవసరాల అభివృద్ధి, మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించాలనే ఉద్దేశంతో ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించేలా పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. రీసోర్సు పర్సన్లగా పోలు నాయక్, శేఖర్ నాయక్, శంకర్ వ్యవహరించారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం తదితరులు

గడివేముల: ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని సంఘం రాష్ట్ర కౌన్సిలర్ నాగన్న, నంద్యాల జిల్లా కార్యదర్శి మానపాటి రవి, జిల్లా మహిళా కార్యదర్శి కవిత పేర్కొన్నారు. శుక్రవారం గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి మేరీ సునీత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానుయేల్‌తో కలిసి 2025 ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈఓ మేరీ సునీత మాట్లాడుతూ ఏపీటీఎఫ్ డైరీలో ఉపాధ్యాయులకు పొందుపరిచిన అంశాలు అలాగే విద్యాశాఖకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులన్నింటిని ఒకచోట కూర్చి 'ఉపాధ్యాయ దర్శిని' రూపంలో ముద్రించడం అభినందనీయమన్నారు. నాయకులు నాగేంద్ర, రాంపుల్లా రెడ్డి, లక్ష్మనాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ: యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ, అధ్యాపక దర్శిని, స్టికర్స్‌ను ఎంఈఓ మేరీ సునీత శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, అధ్యక్షుడు సుబ్బయ్య, జిల్లా కౌన్సిలర్ అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com